

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 521.90 అడుగుల వద్ద ఉంది. ఇది 152.7628 టీఎంసీలకు సమానం.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.



మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు

విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడలో జరిగే చండీ రుద్ర రాజ శ్యామల మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు.

న్యూస్‌రీల్

పాలిసెట్‌కు 84.63 శాతం హాజరు



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై బుధవారం నిర్వహించిన పాలిసెట్–2023 సజావుగా జరిగింది. గుంటూరు నగర పరిధిలోని వివిధ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన 14 పరీక్ష కేంద్రాల పరిధిలో కేటాయించిన 5,409 మంది విద్యార్థులకుగాను 4,578 మంది హాజరయ్యారు. 84.63 శాతం హాజరు నమోదైంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగ్గా, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని కేంద్రాల వద్ద విద్యార్థులకు తనిఖీలు నిర్వహించారు. హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్ మినహా ఇతర ఎటువంటి సామగ్రిని కేంద్రాల్లోనికి అనుమతించలేదు. ఎటువంటి అవాంతరాలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పాలిసెట్–2023 గుంటూరు జిల్లా సమన్వయకర్త తాళ్లూరి శేఖర్ తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు లీగల్: ఈ నెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్ జరుగుతుందని తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, సివిల్ దావాలు, బ్యాంకు, రెవెన్యూ, బీమా, భూ సేకరణ, వివాహ సంబంధిత, మోటారు ప్రమాదాలు, ఎలక్ట్రిసిటీ, ప్రీలిటిగేషన్ తదితర కేసులు పరిష్కరించనున్నట్లు వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌తో అమూల్యమైన సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు.

యార్డులో 88,049 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 81,023 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,049 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ. 5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 52,178 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జె.మోహనరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సమావేశంలో భాగంగా ఫిబ్రవరి 4న నిర్వహించిన సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలపై చర్చించి, ఆమోదిస్తామని తెలిపారు. కాగా మూడు జిల్లాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కానున్నారని తెలిపారు.

ఆరోగ్యమిత్రల ఎంపిక జాబితా విడుదల

గుంటూరు మెడికల్: ఆరోగ్య మిత్ర ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేసినట్లు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగళ్ల జయరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైనవారి జాబితాను గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త కార్యాలయంలో guntur.ap. gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

స‘మూలా’ ఏరివేతపై దృష్టి

- గంజాయి నివారణకు మూలాలపై దృష్టి పెట్టిన పోలీసులు
- సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా
- సూత్రదారులను గుర్తించే పనిలో పోలీసులు
- పదేపదే అరెస్ట్ అయిన వారిపై పీడీ కేసులు నమోదు
- ఒడిశా టూ కేరళ, కర్ణాటక, తమిళనాడుకు సరఫరా అవుతున్న గంజాయి
- 132 మంది అరెస్ట్...వారిలో నలుగురిపై పీడీ కేసులు నమోదు



పట్టుకున్న గంజాయిను విలేకరులకు చూపుతున్న ఎస్పీ వకుల్ జిందాల్ (ఫైల్)

బాపట్లటౌన్: ప్రభుత్వ ఆదేశాలతో అటు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), ఇటు జిల్లాలోని సివిల్ పోలీస్ అధికారులు గంజాయి రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ బాస్ ఆధ్వర్యంలో మూలాల ఏరివేతకు శ్రీకారం చుట్టారు. గంజాయి రవాణా చేసే వారిపైనే కాదు వినియోగదారులపై కూడా కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల గంజాయి సరఫరా మూలాలను వెతికి అంతరాష్ట్రాలకు సైతం గంజాయిని సరఫరా చేసే వ్యక్తులనూ అదుపులోకి తీసుకున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం...

జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై పోలీస్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. పెద్ద ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను జైలుకు పంపుతున్నారు. పదేపదే నేరాల్లో పట్టుబడుతున్న వారిపై సస్పెక్ట్ షీట్లు, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు కూడా వెనుకాడడం లేదు. ఇప్పటికే జిల్లాలో నలుగురిపై పీడీ కేసులు నమోదుచేశారు. ఒడిశా రాష్ట్రం నుంచి జిల్లా మీదుగా తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్న నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకొని గంజాయి మూలాలు ఎక్కడి నుంచి ప్రారంభం అవుతున్నాయనే కోణంలో ఆరా తీస్తున్నారు. దానిలో భాగంగా ఇప్పటికే పలు రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేసే కొందరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారిస్తున్నారు.

సంకల్పానికి శ్రీకారం...

ప్రధానంగా గంజాయి విక్రయాలు విద్యార్థులు, యువతే లక్ష్యంగా సాగుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీనికి అధిగమించేందుకు జిల్లాలో నూతనంగా సంకల్పం కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీకారం చుట్టారు. యువకులు, విద్యార్థులతో వ్యాపారాలు చేయిస్తే ఎవరికి అనుమానం రాకుండా ఉంటుందని గ్రహించిన ఇతర రాష్ట్రాల వ్యాపారులు వారిద్వారా లావాదేవీలను నడుపుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన ఎస్పీ అలాంటి వారిని అదుపులోకి తీసుకొని వారికి కౌన్సెలింగ్ ఇవ్వడమే కాకుండా వారు పరివర్తన చెందే విధంగా జిల్లాలోని కళాశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ‘సంకల్పం’ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మత్తుకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నారు. అదేక్రమంలో తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలని, పిల్లల ప్రవర్తనలో తేడా వస్తే బెదిరించడం, దండించడం చేయకుండా స్నేహపూర్వకంగా మాట్లాడి, కారణాలు తెలుసుకోవాలని, మత్తుకు అలవాటుపడ్డారని తెలిస్తే కౌన్సెలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

అలవాటైతే జీవితం అంధకారమే...

> గంజాయికి అలవాటు పడితే జీవితం అంధకారంగా మారుతుంది. గంజాయిను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. కేవలం సరఫరా, విక్రయదారులే కాకుండా గంజాయి సేవించే వినియోగదారులు కూడా జైలుకెళ్లడం ఖాయం. బాపట్లను గంజాయి రహిత జిల్లాగా మార్చడంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సంకల్పం పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా యువకులు, విద్యార్థుల కదలికలపై ఆరా తీస్తుండాలి.
>
> – వకుల్ జిందాల్, జిల్లా ఎస్పీ

సరిహద్దులో ప్రత్యేక నిఘా...

మార్టూరు సర్కిల్ పరిధిలో పర్చూరు, యద్దనపూడి, మార్టూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో ప్రధాన కూడలి ప్రాంతాలతోపాటు సరిహద్దు ప్రాంతాల్లో 20 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇటీవల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మరో 25 సీసీ కెమెరాలను అమర్చి మొత్తం 45 కెమెరాలతో నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు.. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆధ్వర్యంలో గస్తీముమ్మరం చేయడంతోపాటు టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 851 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుంటే ఒక్క మార్టూరు టోల్‌ప్లాజా సమీపంలోనే 730 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

12 నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



రేపల్లె రూరల్: విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ, ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. 12వ తేదీన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ సిబ్బంది దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా 13న ద్వారకా తిరుమల ఆలయ నిర్వాహకులచే వేంకటేశ్వరస్వామి కల్యాణం, 14న అన్నవరం ఆలయ నిర్వాహకులచే రమాసమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణం, 15న శ్రీశైలం ఆలయం వారిచే భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం, 16న సింహాచలం ఆలయ నిర్వహకులచే వరాహ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం, 17న మహాపూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతి రోజు పూజ్య పీఠాధిపతుల అనుగ్రహ భాషణం, ప్రవచన కర్తల ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, రాష్ట్రప్రజల సంక్షేమానికి నిర్వహించే కార్యక్రమాలలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

సంజాయిషీ కోరాలని సీఈఓకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశానికి బాపట్ల జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు గైర్హాజరు కావడంపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇంకొల్లు జెడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి మాట్లాడుతూ జెడ్పీ నిధుల నుంచి మంజూరై పూర్తి చేసిన పనులకు బిల్లులు ఎందుకు పంపడం లేదో వివరణ కావాలని పట్టుబట్టారు. దీనికి వివరణ ఇచ్చేందుకు సంబంధిత అధికారులు సమావేశంలో లేకపోవడంపై జెడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారుల నుంచి వెంటనే సంజాయిషీ కోరాలని జెడ్పీ సీఈఓ జాలిరెడ్డిని ఆదేశించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం మాట్లాడుతూ జూలైలో నీరు ఇచ్చేందుకు షెడ్యూల్ ఏమైనా ప్రకటించారా లేదా తెలపాలని కోరారు. షెడ్యూల్ ప్రకారం నీరు వదిలితే ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖాధికారులు సంయుక్తంగా పనిచేయాలన్నారు. జగనన్న ఇళ్ల స్థల కేటాయింపులో హౌసింగ్ శాఖాధికారులు దృష్టి సారించాలని సూచించారు. చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ జలసిరి బోర్లు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినా ఎందుకు మంజూరు చేయలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు ఉమ్మడిగా ఇవ్వడం వల్ల సమస్యలు వస్తున్నాయని, వాటిని వ్యక్తిగతంగా రాయితీపై ఇవ్వాలని కోరారు. పుల్లలచెరువు జెడ్పీటీసీ మాట్లాడుతూ విత్తనాలు సకాలంలో అందించాలని, పత్తి విత్తనాలకు రాయితీ ఇవ్వాలన్నారు. త్రిపురాంతకం జెడ్పీటీసీ మాట్లాడుతూ బీమా అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లింగసముద్రం జెడ్పీటీసీ మాట్లాడుతూ రాళ్లపాడు, చిన్నపవని ఎస్సీ, ఎస్టీ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని కోరారు. స్త్రీ శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ సమీక్ష సమావేశాలకు జెడ్పీటీసీ సభ్యులను పిలవకుండా, ప్రోటోకాల్ పాటించకుండా ప్రైవేట్ వ్యక్తులతో ప్రారంభం చేయించిన సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పీడీని ఆదేశించారు. మొత్తం ఏడు సంఘాల సమావేశాలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రతి విషయానికి యాక్షన్ టేకెన్ రిపోర్టు తయారుచేసి అధికారులు పంపాలని, అధ్యక్షుల ఆదేశాల మేరకు ప్రోటోకాల్ పాటించని వారిపై చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

‘మత్స్యకార భరోసా’ను విజయవంతం చేద్దాం

- రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున
- ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్సీ తలశిలతో కలిసి సభాస్థలి, హెలిప్యాడ్ స్థలాల పరిశీలన



సభాస్థలి, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మేరుగ, ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్సీ తలశిల

నిజాంపట్నం: ఈనెల 16వ తేదీ జరిగే మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని విజయవంతానికి కృషిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున కోరారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఈనెల 16వ తేదీ బాపట్ల జిల్లా నిజాంపట్నంకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో సభాస్థలి, హెలిప్యాడ్‌కు అనువైన స్థలాలను, వాహనాల పార్కింగ్ స్థలాలను బుధవారం మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌లు పరిశీలించారు. వివిధ ప్రదేశాలను పరిశీలించి హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా నిజాంపట్నం – బాపట్ల రోడ్డులోని ప్రాంతాన్ని ఎంపిక చేశారు. నిజాంపటనం–రేపల్లె రోడ్డులో నిజాంపట్నం శివారున సభాస్థలి ప్రాంగణాన్ని, వివిపీ వాహనాలు, సభా ప్రాంగణానికి వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్‌కు స్థలాలను ఏంపిక చేశారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 16వ తేదీ మత్స్యకార భరోసాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి 1,23,519 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.123.52 కోట్లను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పటిష్ట బందోబస్తు, హెలిప్యాడ్, సభాస్థలి ప్రాంగణంలో బ్యారికేడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ క్యాంపులు, ప్రజలకు తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా పలుశాఖల అధికారులకు ఆయా శాఖలు చేయాల్సిన ఏర్పాట్లను సూచించారు.

సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక

- ప్రజలు ‘జగనన్నకు చెబుదాం’ను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



పల్లపట్లలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

బాపట్ల: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జగనన్నకి చెబుదాం కార్యక్రమంపై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం పోర్టల్‌ను తొమ్మిదోతేదీ ప్రారంభించటం జరిగిందన్నారు. జిల్లాలో ప్రజా సమస్యలు తెలియజేసేందుకు 1902 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌కు అర్జీలు జిల్లాస్థాయికి వస్తాయన్నారు. ఈ అర్జీలను డివిజన్, మండల స్థాయిలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో జగనన్నకు చెబుదాంలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన...

నిజాంపట్నం: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుదని బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. నిజాంపట్నం మండంలోని పలపట్ల గ్రామంలో ఇటీవల అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, వేరుశనగ పంటలను కలెక్టర్ బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షాలకు తడిచిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులు ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారు. అదేవిదంగా క్రాఫ్ ఇన్స్యూరెన్స్ రైతులకు వర్తింపు చేసేలా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. ఆయన వెంట వ్యవసాయశాఖ అధికారులు తదితరులున్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు బుధవారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. గుంటూరు మొహిద్దీన్ పాలెంకు చెందిన కె. దుర్గరావు, ఉమాశైలజ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందచేశారు.

తీరం.. ఆధ్యాత్మిక శోభితం



నిర్మాణంలో తారకేశ్వర స్వామి ఆలయం

బాపట్ల అర్బన్: సూర్యలంక తీరాన ఆధ్యాత్మిక కెరటం ఉవ్వెత్తున ఎగసిపడబోతోంది. యాత్రికులను భక్తిభావ తరంగంలో ముంచెత్తి ఆనంద తీరాలకు చేర్చబోతోంది. పర్యాటకానికి పట్టుగొమ్మగా మారిన సూర్యలంక సముద్ర ప్రాంతం.. ఇకపై ఆధ్యాత్మిక శోభితమై విరాజిల్లనుంది. 800 ఏళ్ల క్రితం నాటి శిల్ప కళా నైపుణ్యాన్ని ఇనుమడింప చేసుకుని దివ్య సాకేతం నిర్మాణమై చారిత్రిక వైభవాన్ని అణువణువునా నింపుకోనుంది. అత్యంత మహిమాన్విత క్షేత్రం తారకేశ్వర స్వామి ఆలయం భావపురి జిల్లా సిగలో చేరింది.

13న ఆలయ ప్రతిష్ట మహోత్సవం..

సముద్ర తీర ప్రాంతంలో ఆలయ నిర్మాణాలు భారతదేశంలో ప్రాముఖ్యతను సంతరించుకొని ఉన్నాయి. ఇప్పటికే ఇక్కడ నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయం భక్తులకు కొంగు బంగారంగా భాసిల్లుతోంది. తాజాగా తీర ప్రాంతానికి మరింత ఆధ్యాత్మిక వైభవం తీసుకొచ్చేలా తారకేశ్వర స్వామి ఆలయ నిర్మితమైంది. ఎంతో చారిత్రాత్మక, సాంస్కృతిక వైభవం కలిగిన ఈ ఆలయానికి అణువణువూ ఎన్నో విశిష్టతలు ఉన్నాయి.

ప్రత్యేక నిర్మాణ శైలి...

భారతదేశ నాగరికతతోపాటు శిల్ప కళా నైపుణ్యానికి భావితరాలకు వారసత్వ సంపదగా అందించేలా తారకేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. చాణక్యుల శిల్ప శైలిని కలిగిన ఈ తరహా ఆలయాలు ప్రపంచంలోనే మహాబలిపురంలోని కోణార్క్ సూర్య దేవాలయం, రామప్ప వెయ్యి స్తంభాల ఆలయం, వరంగల్ ద్రాక్షారామంలోని భీమేశ్వర ఆలయం మాత్రమే ఉన్నాయి. సూర్యలంక తీర ప్రాంతం ఈ తరహా ఆలయాలకు అనుకూలమని గుర్తించి తారకేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు.

మూడు రాష్ట్రాల శిల్పుల కృషి..

2016 సంవత్సరంలో తారకేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రాణ ప్రతిష్ట చేశారు. తమిళనాడు, కర్ణాటకతోపాటు ఆంధ్రప్రదేశ్ లోని ప్రసిద్ధిగాంచిన శిల్పులతో ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయ నిర్మాణానికి కృష్ణ శిలలను వినియోగించారు. ప్రధాన విగ్రహం కోసం నర్మద నది ఒడ్డు నుంచి రాయిని తెప్పించారు. ప్రతి రోజూ హోమాలు, పూజలు చేస్తూ ఎంతో నిష్ఠతో ప్రధాన శిల్పి అంగప్పన్ ప్రశాంత్ ప్రధాన ఆలయంలోని విగ్రహాన్ని రూపుదిద్దారు. మహా మండప నిర్మాణ పనులను శేష బ్రహ్మం చేశారు. సుమారు ఏడేళ్ల పాటు కఠోర దీక్షతో కేవలం శిల్పకళా వైభవంతో నిర్మించిన ఈ ఆలయానికి ఒక్క యంత్రాన్ని కూడా వినియోగించకపోవడం విశేషం.



గోపాలకృష్ణశర్మ, ఆలయ నిర్మాణ వాస్తు శిల్ప స్థపతి



అంగప్పన్ ప్రశాంత్, ఆలయ నిర్మాణ శిల్పి

ఎందరో ప్రముఖుల హస్తవాసితో..

ఆలయ నిర్మాణానికి స్థపతులుగా కేవీ గోపాలకృష్ణ, కేవీ మంజునాథ్ వ్యవహరించారు. వీరు అనంతపురం జిల్లా వాసులు. వీరు 2016లో దేవదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్‌లో ఉపస్థపతులుగా సేవలందించి, నీలకంఠాపురం నాగర్ కర్నూల్ మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాల్లో సుమారు పది ఆలయాలను నిర్మించారు. బాపట్లలో శివ క్షేత్ర కమిటీ వారి విన్నపంతో సూర్యలంక తీరాన తారకేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పురుడు పోశారు. ఈ నెల 12, 13 తేదీల్లో దక్షిణ నాయి శృంగేరీ శారద పీఠాధిపతులు భారతీ తీర్థ మహా స్వామి, విధుశేఖర భారతి మహాస్వామి, రామకృష్ణ మఠం సాధు పుంగవుల సమక్షంలో విగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ట మహోత్సవాలు, ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఇది తిరుపతి వేదిక్ యూనివర్సిటీ డీన్ గోలి వెంకటసుబ్రహ్మణ్య శర్మ అవధాని పర్యవేక్షణలో చేపట్టనున్నారు.

దృఢ సంకల్పంతో..

తారకేశ్వర స్వామి వారి దేవాలయం నిర్మించాలని మొట్టమొదటగా మంతెన దశరథ మహారాజు సంకల్పించారు. ఇందుకు ఆయన ఆలయ కమిటీని ఏర్పరిచారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం కోసం మంతెన రామ్మూర్తి రాజు, పెనుమెత్స నాగరాజు (చినబాబు), దెందుకూరి సత్యవతి బైర్‌రాజు నందిని, మంతెన సత్యనారాయణ రాజులతోపాటు దాతలు ముందుకొచ్చారు. వారు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భావపురి జిల్లాలో ఒక మహాద్భుతమైన చారిత్రక ఆలయ నిర్మాణానికి నాంది పలికారు.

రైతులకు న్యాయం చేస్తాం

వ్యవసాయ శాఖ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్‌పాండే



చోడవరంలో ఏఓ శైలజ నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాహుల్ పాండే

పెనమలూరు: అకాల వర్షాల కారణంగా తడిసిన మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేసిన రైతులకు న్యాయం చేస్తామని అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్, డైరెక్టర్ రాహుల్‌పాండే అన్నారు. చోడవరం గ్రామంలో బుధవారం అధికారులు బృందంతో కలిసి తడిసిన మొక్కజొన్న, జొన్న పంటలను ఆయన పరిశీలించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి రైతుల వద్ద నుంచి మొక్కజొన్న సేకరిస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్‌పాండే మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా జొన్న, మొక్కజొన్న, వరి సాగు చేసిన రైతులకు తీవ్ర ఇబ్బందులు వచ్చాయన్నారు. రైతులకు ఆదుకోవటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో పంటల వివరాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయటానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మొక్కజొన్న క్వింటా రూ. 1,962 గిట్టుబాటుధర ప్రభుత్వం ఇస్తోందన్నారు. తేమ శాతం తగ్గటానికి తడిచిన మొక్కజొన్న పంటను రైతులు ఎండబెట్టాలన్నారు. బాగా ఉన్న మొక్క జొన్న పంటలో బూజు పట్టిన పంటను కలిపితే నష్టం పెరుగుతుందని, ఈ విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న పంట ప్రభుత్వం కొనుగోలు చేసినట్లే జొన్న పంటను కూడా కొనుగోలు చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సమాధానం చెబుతూ త్వరలో ఉన్నత స్థాయిలో సమావేశం ఉందని, జొన్న పంట విషయం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. జేడీ మార్కెటింగ్ శ్రీనివాసరావు, డీఎం మార్క్‌ఫెడ్ మురళీ, ఏడీ మార్కెంగ్ నిత్యానంద, ఏఓ శైలజ పాల్గొన్నారు.

జూన్ ఒకటి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు

- రూ.4.5 కోట్లతో వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం
- చురుగ్గా ఏర్పాట్లు
- ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి

బాపట్లఅర్బన్: బాపట్ల మండలం కొండుభొట్లపాలెంలో రూ.4.5 కోట్లు వెచ్చించి నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రతిష్ఠాపన మహోత్సవాలు జూన్ ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్సవాలు ఏడో తేదీ వరకు జరుగుతాయని అన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.కోటి వెచ్చించి గాలిగోపురం తుదిమెరుగులు దిద్దుతున్నట్లు తెలిపారు. తన స్వగ్రామమైన కొండుభొట్లపాలెంలో గ్రామదేవత కొండలమ్మ అమ్మవారి దేవస్థానాన్ని 20 సంవత్సరాల కిందట నిర్మించామని, పక్కనే శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మించి అందులో వేంకటేశ్వరస్వామి, పద్మావతి, వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. అయ్యప్పస్వామి, కుమారస్వామి, ఆంజనేయస్వామి ఉపాలయాలు కూడా ముస్తాబు అవుతున్నాయన్నారు. గ్రామస్తుల సహకారంతోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.65 లక్షల ఆర్థికసాయం అందినట్లు వెల్లడించారు. మహోత్సవాలకు మంత్రి కొట్టు సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతారని ఉమ్మారెడ్డి తెలిపారు. సమావేశంలో రామారావు, శంకరరావు, బాబురావులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనలతో ఉపయోగం

ప్రారంభమైన జాతీయ నాటకోత్సవాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి


రెండు నిశ్శబ్దాల మధ్య నాటికలోని ఓ సన్నివేశం

చీరాలఅర్బన్: మారుతున్న కాలానికి అనుగుణంగా నాటక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. కళాంజలి (సాంస్కృతిక మిత్రమండలి) ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల జాతీయ నాటకోత్సవాలను బుధవారం రాత్రి స్థానిక కస్తూర్బా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో రాయని హనుమంతరావు కళాప్రాంగణంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మార్పునకు నాటకాలు దోహదపడతాయన్నారు. జిల్లాలో ఎంతో మంది నాటక, సినీరంగాల్లో ఖ్యాతి పొందినవారున్నారన్నారు. సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా నాటక రంగానికి ఇంకా అభిమానులు ఉన్నారని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కళాంజలి ప్రతినిధులను ఆయన అభినందించారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. ఎమ్మెల్యే చేతుల మీదగా బహుమతులు ప్రదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్ మామిడాల రాములు, కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి దరియా సాహెబ్, పూర్ణా సత్యం, వడలి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'రెండు నిశ్శబ్దాల మధ్య' నాటిక

కళాంజలి ఆధ్వర్యంలో జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అభినయ ఆర్ట్స్, గుంటూరు వారిచే రెండు నిశ్శబ్దాల మధ్య నాటికను ప్రదర్శించారు. యస్.రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించారు. అలానే రసఝరి పొన్నూరు, నిడుబ్రోలు వారిచే 'కాపలా' నాటికలు ప్రదర్శించారు. వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు.



ప్రమాదంలో గాయపడ్డ చిన్నారి మృతి



బల్లికురవ: ఇంటిముందు ఆడుకుంటున్న బాలుడిని మంచినీరు సరఫరా చేసే వాహనం ఢీకొనటంతో గాయాలపాలై చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఏఎస్సై సి.బాలకృష్ణ కథనం ప్రకారం .. మండలంలోని కొప్పరపాడు సుగాలితండాకు చెందిన కేతావత్ శ్రీను నాయక్, లక్ష్మీ భాయి దంపతులకు ముగ్గురు కుమారులు. మూడో కుమారుడైన మనోవినయ్ నాయక్ (2) మంగళవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో మంచినీరు సరఫరా చేసే వాహనం బాలుడిని ఢీకొనటంతో తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తొలుత ఒంగోలులో వైద్యశాలకు తీసుకెళ్లి..ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి శ్రీనునాయక్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులను సమర్థంగా నిర్వర్తించండి

పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఎస్పీ మహేష్

నరసరావుపేట: విధులను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వర్తిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి నూతన డీఎస్పీకి సూచించారు. నరసరావుపేట నూతన డీఎస్పీగా కేవీ మహేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీని జిల్లా పోలీసు కార్యాలయంలో కలిశారు. నూతన డీఎస్పీకి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. కేవీ మహేష్ 2018 బ్యాచ్‌కి చెందిన వారు కాగా, తొలిసారిగా కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటకు వచ్చారు. సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు నూతన డీఎస్పీని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహాలక్ష్మి మహాయజ్ఞాన్ని విజయవంతం చేయాలి


మంత్రి మేరుగకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న జిల్లా ఎండోమెంట్ అధికారి పానకాలరావు

బాపట్లఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ ధర్మాదాయ శాఖ నిర్వహణలో అష్టోత్తర శత కుండాత్మక (108) చండీ రుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞం విజయవంతం చేయాలని జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఎం. పానకాలరావు అన్నారు. బాపట్ల పట్టణంలోని స్థానిక రామానుజ కూటమి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 17 వరకు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శ్రీమహాలక్ష్మి యజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాయజ్ఞంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో బాపట్ల ఈవో డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మేరుగకు ఆహ్వానం

కొల్లూరు: రాష్ట్ర ప్రజల శాంతిసౌభాగ్యాలు, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి మహా యజ్ఞ కార్యక్రమానికి హాజరవ్వాలని దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు మంత్రి మేరుగ నాగార్జునకు ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం బాపట్ల జిల్లా ఎండోమెంట్ అధికారి ఎం.పానకాలరావు మంత్రి మేరుగ నాగార్జునను కొల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పూజాకార్యక్రమాలకు హాజరవ్వాలని ఆహ్వానించారు. మంత్రి మేరుగ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ సంయుక్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహా యజ్ఞంలో ప్రజలు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో కొల్లూరు దేవస్థాన సముదాయాల కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమ కోసం పెద్ద పీట వేశారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరు మార్కెట్ యార్డులో బుధవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. వేమూరు నియోజకవర్గంలో 25 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మొక్కజొన్న పంట మద్దతు ధర రూ.1962 కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షులు గాజుల భానుప్రకాశ్, కోగంటి లవకుమార్, పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న కానిస్టేబుల్‌పై కేసు నమోదు

నరసరావుపేటటౌన్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న కానిస్టేబుల్, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు బుధవారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన షాకీరాకు గుంటూరుకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఎండీ నూరుల్లాతో 8 నెలల కిందట వివాహం అయ్యింది. రెండు నెలలు బాగానే కాపురం చేశారు. అనంతరం అదనపు కట్నం కోసం భర్త, అతని సోదరుడు సమీఉల్లా, అతని భార్య అప్సనా మరో సోదరుడు షాహిదుల్లా, అతని తల్లి మైమున్నిసా తరచూ అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణదాత

- అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ
- ప్రమాదంలో గాయపడిన యువకుడు
- బ్రెయిన్ డెడ్ అని నిర్ధారించిన వైద్యులు
- అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు


వల్లుపు శ్రీరాములు (ఫైల్)

తాడేపల్లిరూరల్ : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఓ యువకుడు అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించాడు. తాను తనువు చాలించినా మూడు కుటుంబాల్లో ఆనందాలు నింపాడు. మణిపాల్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన వల్లుపు శ్రీరాములు(23) సెంట్రింగ్ పనిచేస్తుండగా ప్రమావశాత్తు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం శ్రీరాములుకు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో శ్రీరాములు భార్య వసంత, తండ్రి ఏడుకొండలు, తల్లి సుశీల అవయవ దానానికి అంగీకరించారు. కాలేయం, కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశామని, మరొక కిడ్నీని ట్రాన్స్‌ప్లాంటేషన్ నిమిత్తం గుంటూరులోని వేదాంత హాస్పిటల్‌కు తరలించామని వైద్యులు తెలిపారు. అవయవదానానికి ముందుకు వచ్చినందుకు దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ-స్టాంపింగ్‌తో రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం

స్టాంపుల శాఖ డీఐజీ శ్రీనివాసరావు

గుంటూరు వెస్ట్: నాన్ జుడీషియల్ స్టాంపులు లేకపోయినా, బ్యాంకుల్లో చలాన్లు కట్టకపోయినా ఈ-స్టాంపింగ్ ద్వారా సులభంగా చెల్లిస్తూ రిజిస్ట్రేషన్లతోపాటు నాన్ జుడీషియల్ స్టాంపుల కొరత కూడా తీర్చుకోవచ్చని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ఈ-స్టాంపింగ్‌ను అవసరమున్న ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. అగ్రిమెంట్లు, అఫిడవిట్లు, దస్తావేజుల రిజిస్ట్రేషన్లు ఇలా ఎక్కడ అవసరమున్నా వీటిని ఉపయోగించుకోవచ్చని వివరించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-స్టాంపింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే కొందరు వెండార్లకు లైసెన్సులు కూడా ఇచ్చామని పేర్కొన్నారు.

రాష్ట్ర కాపు జేఏసీ లీగల్ సెల్ చైర్మన్‌గా సత్యనారాయణ

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు, బలిజ, తెలగ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్‌గా సీహెచ్‌వీ సత్యనారాయణ(అడిషనల్ పీపీ)ను ఎన్నుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు అసోసియేషన్ జేఏసీ సమావేశం బుధవారం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ లీగల్ సెల్ చైర్మన్‌గా పేద వర్గాలకు ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అమ్మ శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నరసరావుపేట టౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు, రూ.4.50 లక్షల పరిహారం చెల్లించాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ.వెంకట నాగేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన కె.బాపిరెడ్డి వద్ద రామడుగు వెంకటేశ్వర్లు 2016లో రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో 2021 డిసెంబర్ 13న రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏడాది జైలు, ఫిర్యాదు దారుడికి రూ.4.50 లక్షల పరిహారం అందజేయాలని తీర్పు చెప్పారు. నిందితుడు తీర్పుపై జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోవటంతో దిగువ కోర్టు విధించిన తీర్పును యధావిధిగా ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

పేద ఇక రాజాగా


కృష్ణాయపాలెం లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లు


యర్రబాలెం లే అవుట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృశ్యం

సీఆర్డీఏ పరిధిలోని ఆర్-5 జోన్‌లో పేదల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన భూముల్లో లే అవుట్ల అభివృద్ధి పనులు చకచక సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల కొంత అవరోధం కలిగినా తాజాగా రెండు రోజులుగా కాస్తున్న ఎండలతో మళ్లీ పనులు ఊపందుకున్నాయి. ఫలితంగా నిడమర్రు, నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెంలోని సుమారు 550 ఎకరాల్లో 23వేల మంది పేదలకు స్థలాలు కేటాయించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనులను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం హద్దురాళ్ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈనెల 17వ తేదీ నాటికి లే అవుట్లలో అన్ని పనులూ పూర్తిచేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది.

– మంగళగిరి